# నమస్తే తెలంగాణ

## యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, సోమవారం 15 జూలై 2024 | YADADRI BHUVANAGIRI


## నకిలీ యాప్స్‌లో పెట్టుబడి పెట్టి మోసపోవద్దు

- నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ సిటీ, జూలై 14 : అధిక రాబడికి ఆశపడి నకిలీ స్టాక్ మార్కెట్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోవద్దని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. అధిక రాబడి వాగ్దానాలతో మోసగాళ్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు ఇస్తూ బాధితులను ఆకర్షిస్తున్నారని తెలిపారు. జెఫరీస్ ఎంటర్‌ప్రైజెస్, సాక్షిసింగ్ మోతీలాల్ ట్రేడ్ వంటి నకిలీ మొబైల్ యాప్‌ల ద్వారా వాట్సాప్ కాల్ మాట్లాడుతూ వేర్వేరు బ్యాంకు అకౌంట్లలో డబ్బులు వేయించుకొని అధిక లాభాన్ని చూపుతూ మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఇటువంటి మోసపూరిత స్టాక్ మార్కెట్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటి ఒక కేసు నమోదైందని, బాధితుడు ఈ యాప్‌లో రూ.11 లక్షలు పెట్టి మోసపోయాడని తెలిపారు. ఇలాంటి యాప్‌ల బారిన పడొద్దని ఎస్పీ సూచించారు.



మాఢవీధుల్లో భక్తుల సందడి

## యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట, జూలై 14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, శివాలయం, శ్రీవారి మెట్ల మార్గంలో రద్దీ నెలకొంది.

స్వామివారి ధర్మ దర్శనానికి 2 గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

# రైతు బీమాపై రంది

వచ్చే నెల 13తో ముగియనున్న బీమా గడువు






**ఏటా జూలై 10నుంచే దరఖాస్తుల స్వీకరణ**

**నేటికీ ఉలుకూ పలుకు లేని సర్కారు**

**రైతుబంధులాగే ఇదీ కాలయాపనేనా అన్న అనుమానాలు**

**ఆరేండ్లుగా 1.08లక్షల కుటుంబాలకు బాసటగా పథకం**

**రైతుబీమాను ఆపొద్దంటున్న రైతులు**

కారణాలతో నిమిత్తం లేకుండా కుటుంబ పెద్దను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉండే రైతు కుటుంబాలకు అండగా నిలిచేందుకు కేసీఆర్ సర్కార్ దేశంలోనే అత్యుత్తమ పథకం రైతుబీమాను రూపొందించింది. ఆ పథకంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఒక్కో సంక్షేమ పథకానికి ఎసరు పెట్టే క్రమంలో రైతుబీమాను పక్కన పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. అందుకే ఇప్పటికే మొదలవ్వాల్సిన రైతుబీమా ప్రక్రియ ఉలుకూపలుకు లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న బీమా గడువు వచ్చే నెల 13న ముగియనున్న నేపథ్యంలో ఆలోపే అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. ఇందుకోసం ఈ నెల 10నుంచే రైతు బీమాకు దరఖాస్తులు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ.. రేవంత్‌రెడ్డి సర్కార్ వ్యవహారం చూస్తుంటే దీనికి కూడా ఎగనామం పెడుతారా? అన్న అనుమానం సర్వత్రా నెలకొంది.

– నల్లగొండ ప్రతినిధి, జూలై 14 (నమస్తే తెలంగాణ)

సమైక్య రాష్ట్రంలో రైతులు చనిపోతే దిక్కూమొక్కు లేకుండా ఉండేది. ఇతర రకాల మరణాలను పక్కన పెడితే.. కనీసం వ్యవసాయంలో అప్పుల కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు పరిహారం చెల్లింపుల ఊసే ఉండేది కాదు. పైగా ఆత్మహత్యలను అపహాస్యం చేసేలా వ్యవహరించిన తీరు మరణించిన రైతు కుటుంబాలను మానసికంగా ఎంతో కుంగదీసేది. స్వరాష్ట్రంలో రైతులకు అలాంటి పరిస్థితి ఉండొద్దని అప్పటి సీఎం కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టిన బృహత్తర పథకమే రైతు బీమా. రాష్ట్రంలో పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతీ రైతు నిర్ణీత వయస్సు కలిగి ఉంటే ఏ విధంగా చనిపోయినా తక్షణమే ఆదుకోవాలన్నది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రైతులపై ఒక్క పైసా భారం పడకుండా మొత్తం ప్రీమియాన్ని గత కేసీఆర్ సర్కారే చెల్లిస్తూ వచ్చింది. కారణమేదైనా రైతు మరణించిన పది రోజుల్లోపే ఆ కుటుంబానికి ఐదు లక్షల బీమా సొమ్మును అందజేసే విధంగా పథకాన్ని రూపొందించారు. 2018 ఆగస్టు 15నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చింది. భారతీయ జీవిత బీమా (ఎల్ఐసీ) సంస్థ నిబంధనల మేరకు 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన ప్రతీ రైతును ఈ పథకంలో అర్హులుగా ప్రకటించారు. వారి వివరాలు సేకరించి ప్రీమియం చెల్లింపులు చేశారు. 2018–19 తొలి ఏడాది ఒక్కో రైతుకు రూ.2,271 ప్రీమియం చెల్లించిన ప్రభుత్వం.. 2023–34 సంవత్సరానికి రూ.3600 చెల్లించి బీమాను కొనసాగిస్తూ వచ్చింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆరేండ్లలో 1.08 లక్షల మంది రైతులు మృతిచెందగా.. వారి కుటుంబాలకు రూ.5,402 కోట్లను బీమా సొమ్ముగా చెల్లించి ఆసరాగా నిలిచింది.



### నేటికీ దరఖాస్తుల ఉలుకేది?

ప్రస్తుత బీమా పథకం గడువు ఆగస్టు 13న ముగియనుండడంతో రెన్యూవల్ కోసం ఈ పాటికే దరఖాస్తుల ప్రక్రియ మొదలు కావాల్సి ఉంది. ప్రతియేటా జూలై 10నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలు పెడుతారు. కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు సైతం 18నుంచి 59 ఏండ్ల మధ్య వారైతే అవకాశం కల్పించేవారు. కానీ.. 2024–25 సంవత్సరానికి సంబంధించిన రైతుబీమాపై నేటికీ ప్రభుత్వం వైపు నుంచి ఉలుకూపలుకు లేకపోవడం గమనార్హం. దీనిపై ఇప్పటి వరకు వ్యవసాయ అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో రైతుబంధు పథకం మాదిరిగానే దీన్ని కూడా వాయిదా వేస్తూ వస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు చనిపోయిన సందర్భాల్లో ఆ కుటుంబాలకు ఆర్థికంగా భరోసా ఇస్తున్న కీలకమైన పథకాన్ని సైతం కాంగ్రెస్ సర్కార్ తమ రాజకీయ క్రీడకు వాడుకుంటుందా? అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి భేషజాలకు పోకుండా ఏడాదికి రూ.1500 కోట్లు వెచ్చిస్తే సరిపోయే పథకాన్ని కొనసాగించాలని రైతులు, రైతుసంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే రైతుబీమాకు సంబంధించిన కార్యాచరణ మొదలు పెట్టాలని కోరుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 5.60లక్షల మంది అర్హులు

రైతుబీమా పథకంలో రైతుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుత ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 5.60లక్షల మంది రైతులు రైతుబీమా పథకంలో అర్హులుగా ఉన్నారు. ప్రతియేటా జూలై 10 నుంచి ఆగస్టు 4వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తూ అర్హులైన ప్రతి రైతుకూ అవకాశం కల్పిస్తూ వచ్చారు. ప్రతి ఏడాది ఆగస్టు నుంచి రెన్యూవల్ కానున్న ఈ పథకంలో మరింత మంది రైతులకు అవకాశం లభించింది. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 2.88లక్షల మంది రైతుబీమా పరిధిలోకి రాగా.. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు 1,157 మంది రైతులు వివిధ కారణాలతో మృతిచెందగా బీమా వర్తింపజేశారు. ఇందులో వెయ్యి మందికి పైగా రూ.50కోట్ల వరకు చెల్లింపులు చేశారు. మిగతా వారికి వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మధ్యలో ఎవరి ప్రమేయం లేకుండా పైరవీకారులతో పని లేకుండా పైసా ఖర్చు లేకుండా నేరుగా ఈ సొమ్మంతా రైతు కుటుంబాలకే చెందింది. దీంతో రైతు మరణించిన అనంతరం ప్రభుత్వం చెల్లిస్తున్న బీమా సొమ్ము ఆ కుటుంబాలు నిలదొక్కుకునేందుకు ఎంతో ఆసారానిస్తుంది. అప్పులు, ఇతరత్రా ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగంగా మారాయి.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

## నిరుపేదలకు వరం సీఎం సహాయ నిధి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జూలై 14 : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 43 మంది నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.11,71,500 విలువైన చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా లక్షలాది మంది నిరుపేదలకు సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో దుబ్బ అశోక్ సుందర్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, యాదగిరి, మునాస వెంకన్న, సైదులు గౌడ్ పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులపై కాదు.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జూలకంటి రంగారెడ్డి చురకలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూలై 14 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్టీ ఫిరాయింపులపై కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు దాటినా, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 40 రోజులు దాటినా ఇంతవరకూ పాలనపై దృష్టి సారించడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్ల పెంపు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం వంటి హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమవుతున్నారన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు డబ్బికార్ మల్లేశ్, మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరశురాములు, పాదూరి శశిధర్‌రెడ్డి, రామ్మూర్తి, అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో వర్గపోరు

తుంగతుర్తిలో చిరిగిన ఎమ్మెల్యే సామేల్ ఫ్లెక్సీలు



చిరిగిపోయిన ఎమ్మెల్యే సామేల్ ఫ్లెక్సీలు

సూర్యాపేట, జూలై 14 (నమస్తే తెలంగాణ) : తుంగతుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అదే పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్న విషయం విదితమే. ఇసుక విషయంలో ఎమ్మెల్యే సామేల్‌ను కాంగ్రెస్ పార్టీ వారే దుయ్యబడుతున్నారు. ఇక మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఒకడుగు ముందుకు వేసి తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ తన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ఘటనలతో కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి ప్రాధాన్యమిస్తూ పాత వారిని పట్టించుకోవడం లేదని ఈ నెల 1న పీఏసీఎస్ బ్యాంకు వద్ద ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన ఎమ్మెల్యే సామేల్‌కు సొంత పార్టీ నాయకుల నుంచి నిరసన సెగ తగిలింది. అది జరిగి 15రోజులు కాకముందే మరో మారు పార్టీలో గొడవలు బట్టబయలు అయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండలంలోని కొమ్మాల గ్రామంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి సామేల్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు పెట్టించాడు. దీంతో ఆగ్రహించిన కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలను చించిపడేశారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ పాత నాయకులమని చెప్పుకొనేవారే చేశారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో 'ఫ్లెక్సీలు చింపిన లుచ్చా పని చేసిన వారికి, చేయించిన వారికి సమాధానం చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది.. గుర్తుంచుకోండి.' అంటూ సోషల్ మీడియాలో ఘాటైన పోస్టులు పెట్టగా.. మండలంలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల కొత్తగా పార్టీలో చేరిన వారు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. వారి పెత్తనం ఏంటంటూ పాత నాయకులు చించివేసినట్లు తెలుస్తుంది.



## నీలగిరిలో బోనాల సందడి

రామగిరి, జూలై 14 : నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు సమీపంలోని కల్యాణ కనకదుర్గమ్మ దేవస్థానం ప్రాంత కాలనీవాసులు ఆదివారం ఆషాఢ మాస బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని కనకదుర్గమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, తామంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

## సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు




మోటకొండూర్ పోలీసులు అరెస్ట్‌చేసిన బీఆర్‌ఎస్‌వీ నాయకులు

గుండాల, జూలై 14: సీఎం రేవంత్‌రెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్ పర్యటనకు వస్తున్న సందర్భంగా పోలీసులు యువజన నాయకులను ముందుస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్‌వీ మండలాధ్యక్షుడు అట్ల రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుండాల పోలీసులు మండలానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ యువజన నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, అందుకే ముఖ్యమంత్రి ప్రజల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నారని తెలిపారు. యువజన నాయకులను, నిరుద్యోగులను, విద్యార్థులను ముందుస్తుగా అరెస్టు చేయించి మరీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు గడ్డమీది మహోదయ్, జటంగి నాగరాజు, బీజేవైఎం మండలాధ్యక్షుడు మచ్చ వివాకర్‌రెడ్డి, రాజు ఉన్నారు.

- ఆత్మకూరు(ఎం) : అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటారనే అనుమానంతో ఆదివారం మండలంలోని బీఆర్‌ఎస్‌వీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిలో బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు, నియోజకవర్గ నాయకులు గజ్జెల్లి మహేశ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు పైళ్ల ప్రశాంత్, ప్రధానకార్యదర్శి లోడి మహేశ్, సూర్యప్రకాశ్, బండారి సాయి ఉన్నారు.
- భూదాన్‌పోచంపల్లి : పోలీసులు ముందస్తుగా మండలానికి చెందిన బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేశారు. సంఘం మండలాధ్యక్షుడు ఉప్పునూతల జగదీశ్, ఉపాధ్యక్షుడు కొత్త నవీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిలువేరు నరేందర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
- మోటకొండూర్ : బీఆర్‌ఎస్ ఆలేరు నియోజకవర్గ ప్రధానకార్యదర్శి జి.వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీస కృష్ణంరాజు, బీజేవైఎం మండలాధ్యక్షుడు భూమండ్ల సతీశ్‌ను ఆదివారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీజెవైఎం మండల సోషల్ మీడియా అధ్యక్షుడు శెనిగరం ప్రదీప్, నాయకులు గాజుల బంగారి ఉన్నారు.

# రేషన్‌లో ముక్కిన బియ్యం

- పేదోళ్లకు దువ్వ, ధూళితో కూడిన బియ్యం సరఫరా
- నిత్యం డీలర్లు, లబ్ధిదారుల మధ్య వాగ్వాదాలు
- ఓ గోదాం వద్ద బియ్యం లిఫ్ట్ చేయలేమన్న కార్మికులు
- నచ్చజెప్పిన అధికారులు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ రేషన్ షాపులో కనిపించిన ముక్కిన బియ్యం

సూర్యాపేట, జూలై 14 (నమస్తే తెలంగాణ) : పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా సరఫరా అవుతున్న బియ్యంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. దువ్వ, ధూళితోపాటు 60 శాతం రంగు మారిన బియ్యం ఉంటున్నాయి. దీంతో నిత్యం డీలర్లు, లబ్ధిదారుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల చివ్వెంల గోదాం వద్ద దువ్వ లేస్తున్నందున ఆరోగ్యాలు పాడవుతాయని తాము బియ్యం లారీల్లోకి ఎత్తలేమని హమాలీలు కరాఖండిగా చెప్పారు. వెంటనే అధికారులు వచ్చి ఇక మీదట మంచి బియ్యం వచ్చేలా చర్యలు చేపడుతామని నచ్చజెప్పి లిఫ్ట్ చేయించారు. రెండు నెలలుగా సూర్యాపేట డివిజన్ పరిధిలో పాడైన బియ్యం సరఫరా అవుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదోళ్లకు ఇచ్చే రేషన్ బియ్యం ముక్కిపోయి, రంగ మారి వస్తున్నాయి. వాస్తవానికి పదేండ్ల క్రితం వరకు రేషన్ బియ్యం బాగాలేవంటూ నిత్యం డీలర్లు, లబ్ధిదారుల మధ్య వాగ్వాదాలు జరిగేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ.. కొద్ది రోజులుగా మళ్లీ పాత రోజులే పునరావృతం అవుతున్నాయి. ఎక్కడి నుంచి బియ్యం సరఫరా చేస్తున్నారో కానీ.. వాటిని చూస్తేనే ఆకలి చచ్చిపోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇటువంటివి ప్రధానంగా సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాల్లోనే సరఫరా అవుతున్నాయి. ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని రేషన్ బియ్యం గోదాం నుంచి తాము బియ్యం తీసుకోమని కొంత మంది డీలర్లు చెప్పేశారట. దుమ్ము, ధూళి, దువ్వతో పాటు దాదాపు 60 శాతం బియ్యం ముక్కిపోయి, రంగు మారి వస్తున్నాయని తీసుకునేందుకు అయిష్టత చూపారు. వారం క్రితం చివ్వెంల పాయింట్ వద్ద బియ్యం బస్తాల నుంచి విపరీతంగా దుమ్ము, ధూళి వస్తున్నదని తమ ఆరోగ్యాలు పాడవుతాయని బస్తాలను లారీల్లోకి ఎత్తేందుకు హమాలీలు నిరాకరించారు. ఈ రెండు సంఘటనల్లోనూ పౌరసరఫరాల శాఖ అధికారులు రంగంలోకి దిగి తుంగతుర్తిలో డీలర్లకు, చివ్వెంలలో హమాలీలకు నచ్చజెప్పి మరోసారి ఇలాంటి బియ్యం రాకుండా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అంతేకాదు.. హమాలీలు, డీలర్లు మాస్కులు ధరించి బియ్యం పంపిణీ చేయాలని అధికారులు సూచించినట్లు తెలిసింది. మరి అంత దారుణంగా ఉన్న బియ్యాన్ని నిరుపేదలు ఎలా తింటారో అధికారులు ఆలోచించకపోవడం శోచనీయం. వచ్చే నెల నుంచి కాదు.. ఇప్పటికిప్పుడు ముక్కిన బియ్యాన్ని వెనక్కు పంపించి మంచి బియ్యం సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### ఎన్ని సార్లు కడిగినా వాసన పోవడం లేదు

నాకు తెల్లరేషన్ కార్డు ఉంది. మా కుటుంబానికి ప్రతి నెలా 35కిలోల రేషన్ బియ్యం వస్తున్నాయి. మేము ఆ బియ్యాన్నే వండుకొని తింటాం. అయితే.. కొన్ని నెలలుగా ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం ముక్క వాసనతోపాటు నల్లగా వస్తున్నాయి. ఎన్ని మార్లు కడిగినా వాసన పోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం మంచిగా ఉండేవి. ఇప్పుడు ముక్కిన, రంగుమారిన బియ్యం వస్తుండడంతో మాలాంటి పేదలు అన్నం వండుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయమై డీలర్లను అడిగితే ప్రభుత్వం ఏవి పంపితే అవే ఇస్తామని ముక్కబెట్టి ఇవ్వాల్సిన అవసరం మాకేందని అంటున్నారు. ఇలాంటి బియ్యం ఎందుకు వస్తున్నాయో అధికారులు విచారణ చేసి నాణ్యమైన బియ్యం అందేలా చూడాలి.

**- షేక్ సుల్తానా, 44వ వార్డు, సూర్యాపేట పట్టణం**

